

శంకర్‌పల్లిలో..


నమస్తే తెలంగాణ

# రంగారెడ్డి

13 హైదరాబాద్, మంగళవారం 23 జనవరి 2024 RANGAREDDY


## సదరం క్యాంపులను వినియోగించుకోండి

వికారాబాద్ కలెక్టర్ నారాయణరెడ్డి



వికారాబాద్, జనవరి 22 : దివ్యాంగులు సదరం క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలని వికారాబాద్ కలెక్టర్ నారాయణరెడ్డి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 23న మధ్యాహ్నం 12 గంటల నుంచి మీసేవా కేంద్రాల్లో స్లాట్ బుక్ చేసుకోవాలన్నారు. ఈ నెల 24, 30, 31 తేదీల్లో తాండూరు ప్రభుత్వ దవాఖానలో జరుగనున్న క్యాంపులకు స్లాట్ బుక్ చేసుకున్న అంగవైకల్యం, బుద్ధిమాంద్యం, చెవుడు, మూగ గల వారు దరఖాస్తు చేసుకోవాలని.. అదేవిధంగా ఈనెల 27, 30 తేదీల్లో వికారాబాద్ కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో నిర్వహించే క్యాంపులకు అంగవైకల్యం, అంధులు హాజరుకావాలన్నారు. ఈ క్యాంపులకు సదరం సర్టిఫికెట్ కాలపరిమితి దాటినవారితోపాటు కొత్తగా స్లాట్‌బుక్ చేసుకున్న వారు హాజరు కావాలన్నారు.



షాబాద్ : సీతారాంపూర్‌లోని సీతారామచంద్రస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న ఎంపీ రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్యే కాలె యాదయ్య



కద్తాల్‌లో



పరిగిలో నిర్వహించిన శ్రీరాముడి శోభాయాత్రలో నృత్యం చేస్తున్న చిన్నారులు

# అక్కడ ప్రతిష్ఠ.. ఇక్కడ పండుగ

అయోధ్యలో నూతనంగా నిర్మించిన రామమందిరంలో సోమవారం బాలరాముడి విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ సందర్భంగా ఉమ్మడి రంగారెడ్డి జిల్లా పులకించిపోయింది. భక్తుల సామూహిక పూజలు, శోభాయాత్రలు, కళాకారుల నృత్యాలు, అన్నదానాలు వంటి కార్యక్రమాలతో పల్లెలు, పట్టణాల్లో పండుగ వాతావరణం కనిపించింది. హిందువులు తమ ఇండ్లపై కాషాయ జెండాలను ఎగురవేశారు. ఊరూరా ప్రత్యేక స్క్రీన్లు ఏర్పాటు చేసుకొని అయోధ్యలో జరిగిన కార్యక్రమాన్ని కనులారా వీక్షించారు. ఇండ్ల వద్ద, దేవాలయాల్లో దీపాలు వెలిగించి జై శ్రీరామ్.. జైజై శ్రీరామ్ అంటూ నినాదించారు. మహిళలు బోనాలతో స్వామివారికి మొక్కులు చెల్లించుకున్నారు. పలు దేవాలయాల్లో ప్రజాప్రతినిధులు, నాయకులు ప్రత్యేక పూజలు చేశారు. షాబాద్ మండలంలోని సీతారాంపూర్‌లోని సీతారామచంద్రస్వామి దేవాలయంలో చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్యే కాలె యాదయ్య ప్రత్యేక పూజలు చేశారు.



శంకర్‌పల్లిలో శ్రీరాముడి శోభాయాత్ర..

## అంగన్‌వాడీ గుడ్ల విక్రేతపై కేసు నమోదు

- విధుల్లో నిర్లక్ష్యం చేసిన పోస్టుమ్యాన్‌పైనా..
- నమస్తే తెలంగాణలో 'అంగట్లో అంగన్‌వాడీ గుడ్లు' శీర్షికతో వార్త ప్రచురితం
- స్పందించిన వికారాబాద్ జిల్లా సంక్షేమ అధికారిణి లలితకుమారి
- ఆ గుడ్లు మహబూబ్‌నగర్ జిల్లావిగా గుర్తింపు

కులకచర్ల, జనవరి 22 : అంగన్‌వాడీ కేంద్రాలకు ప్రభుత్వం సరఫరా చేసిన కోడి గుడ్లను మార్కెట్‌లో విక్రయిస్తే చర్యలు తప్పవని వికారాబాద్ జిల్లా సంక్షేమ అధికారిణి(డీడబ్ల్యూవో) లలితకుమారి అన్నారు. 'అంగట్లో అంగన్‌వాడీ గుడ్లు' అనే శీర్షికతో సోమవారం 'నమస్తే తెలంగాణ'లో ప్రచురితమైన కథనానికి ఆమె స్పందించారు. అంగన్‌వాడీ కేంద్రాలకు చెందిన కోడి గుడ్లపై ప్రభుత్వానికి చెందిన ముద్ర ఉంటుందని, వాటిని ఎక్కడ విక్రయించినా పట్టుకోవచ్చన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలకు గుడ్లు సరఫరా చేసే వ్యాపారులపై ఇప్పటికే నిఘా ఉంచామని.. వాటిని బయట అమ్మేందుకు వీలులేదన్నారు. చౌడాపూర్ మండల కేంద్రంలో కోడి గుడ్లను విక్రయించిన మందిపల్ గ్రామానికి చెందిన పెంటయ్యపై తమ సూపర్‌వైజర్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతోపాటు ఈ విషయాన్ని తహసీల్దార్ దృష్టికి తీసు కెళ్లారన్నారు. ఆ గుడ్లు వికారాబాద్ జిల్లాకు చెందినవి కాదని.. మహబూబ్‌నగర్‌కు చెందిన వ్యక్తి వాటిని తీసుకొచ్చినట్లు విచారణలో తేలిందన్నారు.

### పెంటయ్యపై కేసు నమోదైంది.. : తహసీల్దార్

అంగన్‌వాడీ కేంద్రాలకు చెందిన గుడ్లను చౌడాపూర్‌లో విక్రయిస్తూ పట్టుబడిన పెంటయ్యపై కేసు నమోదు చేయించినట్లు చౌడాపూర్ తహసీల్దార్ ప్రభులు తెలిపారు. ప్రభుత్వం ద్వారా సరఫరా చేస్తున్న గుడ్లను విక్రయిస్తే చర్యలు తప్పవన్నారు. అదేవిధంగా చౌడాపూర్‌లో 2011 నుంచి ఆధార్‌కార్డులు పంచకుండా చెత్త ట్రాక్టర్‌లో పడేసిన పోస్టుమ్యాన్‌పైనా చర్యలు తీసుకుని క్రిమినల్ కేసు పెట్టించడం జరిగిందని తహసీల్దార్ తెలిపారు. దీనికి సంబంధించిన వివరాలను సంబంధిత డిపార్ట్‌మెంట్‌కు పంపించినట్లు చెప్పారు.

# వంద కోట్లు ఉన్నా.. డబుల్ ట్రబుల్

- మౌలిక వసతుల కల్పనకు కేసీఆర్ ప్రభుత్వం కేటాయింపు
- నిధుల విడుదలలో జాప్యం చేస్తున్న కమిషనర్
- డబుల్ ఇండ్ల కష్టాలు తీర్చాలని లబ్ధిదారుల గగ్గోలు
- కమిషనర్ తీరుపై బీఆర్ఎస్ కార్పొరేటర్ల మండిపాటు



డబ్బులేకుండా పనులు నిలిచిన సంఘటనలు ఇప్పటిదాకా చూశాం.. కానీ డబ్బులు ఉన్నా పనులను అటకెక్కించడం ఘనత వహించిన జీహెచ్ఎంసీకే చెల్లింది. తమ కలల ఇంటి సాధమైన డబుల్ బెడ్ రూం ఇండ్లు దక్కించుకొని.. ఆ ఇంటిలో ప్రశాంత జీవనం గడుపుదామని అనుకున్న లబ్ధిదారులకు కమిషనర్ రొనాల్డ్ రాస్ వ్యవహారశైలి శాపంగా మారుతోంది. డబుల్ బెడ్ రూం పట్టాలు ఇచ్చారు సరే .. అందులో ఉందామంటే కనీసం కరెంట్ కనెక్షన్, నిర్వహణ సరిగా లేదంటూ సోమవారం ప్రజావాణి వేదికగా లబ్ధిదారులు గగ్గోలు పెట్టారు.

సిటీబ్యూరో, జనవరి 22 (నమస్తే తెలంగాణ ) : నిరుపేదలు ఆత్మగౌరవంతో బతకాలన్న బలమైన సంకల్పంతో కేసీఆర్ ప్రభుత్వం 111 లోకేషన్లలో డబుల్ బెడ్ రూం ఇండ్ల పథకాన్ని చేపట్టింది. ఇందులో భాగంగానే ఉన్న చోటనే 27 ప్రాంతాల్లో (ఇన్‌సైట్)లో 5,363 మందికి, 39 లోకేషన్లలో 63, 478 మంది లబ్ధిదారులకు డబుల్ బెడ్ రూ ఇండ్లను అందజేసింది. లక్ష డబుల్ బెడ్ రూం ఇండ్ల పంపిణీలో భాగంగా 66 లోకేషన్లలో మొత్తం 68,841 మందికి పట్టాలు అందజేశారు. అయితే కార్పొరేట్ స్థాయిలో ఈ ప్రాజెక్టులో మౌలిక సదుపాయాల కల్పన జరిగింది. కొన్ని చోట్ల కరెంట్ కనెక్షన్, కేబుల్ నెట్‌వర్క్, ఇంటర్ నెట్, ఇతర మెయింటనెన్స్ పనులు పెండింగ్‌లో ఉన్నాయి. ఈ మౌలిక వసతుల కల్పనలోనూ రాజీ పడకుండా కేసీఆర్ సర్కారు హెచ్ఎండీఏ నుంచి రూ. 100 కోట్లను జీహెచ్ఎంసీకి బదలాయించింది. నిబంధనల ప్రకారమే జీహెచ్ఎంసీ ఖజానాలోకి రూ.100 కోట్లు వచ్చి చేరాయి. కానీ నేటికీ ఈ నిధులు ఖజానా నుంచి నిర్వహణకు మళ్లలేదు. సంబంధిత అధికారులు నిధులు ఉన్నాయని, నిర్వహణ పనులు చేపట్టాలని గడిచిన రెండు నెలలుగా కమిషనర్‌కు ప్రతిపాదనలు పెట్టారు. కానీ కమిషనర్ మాత్రం ఎటూ తేల్చకుండా 'డిస్కస్' అంటూ కాలయాపన చేస్తుండడంపై సంబంధిత శాఖ అధికారులు చేసేదేమీ లేక తలలు పట్టుకుంటున్నట్లు ఉద్యోగుల్లో చర్చ జరుగుతున్నది. రోజుల తరబడి ఎలాంటి నిర్ణయం తీసుకోకుండా తన వద్దనే ఫైల్ అంటిపెట్టుకున్న కమిషనర్ తీరుపై బీఆర్ఎస్ కార్పొరేటర్లు మండిపడుతున్నారు. తమకు న్యాయం చేయాలని ఒక పక్క బాధితులంతా ప్రజావాణిలో గగ్గోలు పెడుతుంటే ..ప్రజా సంక్షేమం వైపు సకాలంలో నిర్ణయాలు తీసుకోవాల్సిన కమిషనర్ తీరు సరిగా లేదంటూ కార్పొరేటర్లు అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు. హెచ్ఎండీఏ నుంచి వచ్చిన రూ.100కోట్లు నిధులు భద్రంగానే ఉన్నాయా? ఇతర పనులకు ఈ నిధులను మళ్లించారా? అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. సమస్య జఠిలం కాకముందే కమిషనర్ రొనాల్డ్ రాస్ ఈ విషయంపై సరైన నిర్ణయం తీసుకోవాలని, నిర్వహణ పనులను పూర్తి చేయించాలని లబ్ధిదారులు కోరుతున్నారు.

# మూసీ కోసం.. మూడు పర్యటనలు

20 రోజుల వ్యవధిలోనే...



లండన్‌లోని థేమ్స్ నదీ ప్రాంతంలో పర్యటిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, అధికారులు

సిటీబ్యూరో, జనవరి 22 (నమస్తే తెలంగాణ) : మూసీ పరీవాహక ప్రాంత సుందరీకరణపై కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి సారించింది. స్వయంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో పాటు పురపాలక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ, హెచ్ఎండీఏ కమిషనర్ దానకిశోర్, హెచ్ఎండీఏ జాయింట్ మెట్రోపాలిటన్ కమిషనర్ ఆమ్రపాలి, సీఎంవో అధికారులు దేశ, విదేశాల్లోని నదీ తీర ప్రాంతాల్లో చేపట్టిన అభివృద్ధి ప్రాజెక్టులను స్వయంగా పరిశీలించి, అధ్యయనం చేశారు. జనవరి 2న మూసీ సుందరీకరణపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలోనే 3 నెలల్లోగా మూసీ సుందరీకరణ ప్రాజెక్టు పనులు ప్రారంభించేందుకు చర్యలు చేపట్టాలని సూచించారు. దీంతో సమావేశం జరిగిన రెండు రోజుల్లో హెచ్ఎండీఏ జాయింట్ మెట్రోపాలిటన్ కమిషనర్, మూసీరివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్(ఎంఆర్‌డీసీఎల్) మేనేజింగ్ డైరెక్టర్ ఆమ్రపాలి అహ్మదాబాద్ పర్యటనకు వెళ్లింది. ఆ నగరంలో సబర్మతి నదీతీర ప్రాంతాన్ని అధ్యయనం చేశారు. ఆ తర్వాత ఈ నెల 13న ఆమె లండన్ పర్యటనకు వెళ్లారు. అదే సమయంలో సీఎం రేవంత్ రెడ్డి దావోస్ పర్యటనను ముగించుకొని తన బృందంతో పాటు లండన్ వెళ్లి అక్కడి థేమ్స్ నదీ తీరంలో చేపట్టిన అభివృద్ధిపై అధ్యయనం చేశారు. ఆ తర్వాత వెంటనే దుబాయ్ పర్యటనకు వెళ్లారు. ఇలా 20 రోజులలో మూడు కీలకమైన నదీతీర ప్రాంతాల అభివృద్ధి ప్రాజెక్టులను సీఎంతో పాటు ఉన్నతాధికారుల బృందం అధ్యయనం చేసి వచ్చింది.